నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్ల పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్ శంకుస్థాపన చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో రెండు డివిజన్లల్లో కలిపి రూ.23.10 కోట్ల వ్యయంతో చేపట్టే సీసీరోడ్లు, వరదనీటికాల్వ పనులను వారు ప్రారంభించనున్నారు.

మహా యజ్ఞంలో ఎమ్మెల్యేలు



లంగర్‌హౌస్: త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక మఠ ఆలయం జానకీ సమేత వీర వెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో 18 నెలల పాటు తలపెట్టిన శ్రీరాముడి అఖండ మహాయజ్ఞం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పౌర్ణమి రోజు రాత్రి సుదర్శన హోమం నిర్వహించారు. పరిగి, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యేలు రాంమోహన్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

కఠోర శ్రమతోనే మంచి ఫలితాలు



గోల్కొండ: కఠోర శిక్షణ, క్రమ శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కార్వాన్‌కు చెందిన అంబటి హాసిని నిరూపించింది. సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా అస్మిత లీగ్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొని బంగారు పతకం సాధించింది. సాయంత్రం గుడిమల్కాపూర్‌లోని తన స్వగృహంలో ఆమె తల్లిదండ్రులు అంబటి రవీందర్, అంబికతో కలిసి సంబరాలు చేసుకున్నది. తైక్వాండో కోచ్ సురేందర్‌సింగ్ ఠాకూర్ శిక్షణలో రాష్ట్రస్థాయి పతకాలు సాధించానని ఆమె తెలిపారు.

ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

చార్మినార్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఈ నెల 15న నిర్వహించనున్న అర్బైన్ ర్యాలీ పోస్టర్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ర్యాలీ సందర్భంగా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ..ఈనెల 15న కోట్ల అలీజా నుంచి దారుషిఫా వరకు ర్యాలీ నిర్వహిస్తామని పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

వర్షానికి కూలిన ఇంటి ప్రహరీ

డబీర్‌పురా: ఫర్హత్‌నగర్ ప్రాంతం పార్థీవాడలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ పురాతన ఇంటి గోడ కూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అక్కడికి చేరుకుని పరిశీలించారు. తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పురాతన ఇళ్లల్లో ఉంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇదిలా ఉండగా... ఫర్హత్‌నగర్ ప్రాంతంలోని ఫిలక్‌మాత ఆలయం, అలాగే పలువురి ఇళ్లలోకి పెద్ద ఎత్తున వరద చేరింది.

'కోట' కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోటలోకి ప్రవేశించగానే క్లాపింగ్ పోర్టికో వద్ద ఉన్న భారీ ఫిరంగి వద్ద ఫొటోలు దిగారు. మరోవైపు నగీనాబాగ్‌లో ఉన్న భారీ ఇనుప ముద్దతో యువకులు ఆటలు ఆడుకున్నారు. అలాగే రాణి మహల్, దర్బార్ హాల్, అక్కన్న, మాదన్న కార్యాలయం, ఆయుధాగారం తదితర ప్రాంతాలను ఆసక్తిగా తిలకించారు.

కొత్వాల్‌గూడ రహదారులకు మహర్దశ

చెన్నమ్మ హోటల్ నుంచి వైఆర్ రెడ్డి ఫాంహౌస్ సీసీ రోడ్డు పనులు షురూ

మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న ఎయిర్‌పోర్టు కాలనీ కొత్వాల్‌గూడ బీటీ రోడ్డు పనులు

టోల్‌ప్లాజా నుంచి సాగర్ వరకు 70 ఫీట్ల మేర విస్తరణ చేపట్టేందుకు హెచ్‌ఎండీఏ సర్వే

శంషాబాద్: కొత్వాల్‌గూడ రహదారులకు మహర్దశ పట్టనుంది. సవంత్సరాల తరబడి అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. బస్తీకి అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ఇప్పటికే ఓ సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతుండగా మరో రెండు రహదారుల పనులు 15 రోజుల్లో ప్రారంభించేందుకు సంబంధిత యంత్రాగాలు సిద్ధం అవుతున్నాయి.

ప్రారంభమైన సీసీ రోడ్డు...

చెన్నమ్మ హోటల్ నుంచి కొత్వాల్‌గూడ వైపు వెళ్లే రహదారిని వైఆర్ రెడ్డి ఫాంహౌస్ వరకు హెచ్‌ఎండీఏ రూ. 3.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభించింది. దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఈ రోడ్డు పనులను పరిశీలించారు. అంతేకాకుండా వైఆర్ రెడ్డి ఫాంహౌస్ నుంచి బస్తీ వరకు, ఫాంహౌస్ నుంచి మరో వైపు కొంత మేరకు రహదారులను కూడా అభివృద్ధి చేయాల్సిందిగా హెచ్‌ఎండీఏ యోచిస్తోంది.



చెన్నమ్మ హోటల్ నుంచి వైఆర్ రెడ్డి ఫాంహౌస్ వైపు పనులు జరుగుతున్న సీసీ రోడ్డు

మరో పదిరోజుల్లో...

ఎయిర్‌పోర్టు కాలనీ నుంచి కొత్వాల్‌గూడ ప్రాథమిక పాఠశాల వరకు ఏడుమీటర్ల వెడల్పు, 1.8 కిలో మీటర్ల పొడవున మున్సిపాలిటీ నిధులు రూ. 1.9 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పనులు మరో 10 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన టెండర్ ఇప్పటికే ఆన్‌లైన్‌లో జారీ చేశారు. ఈ నెల 13 టెండర్ ప్రక్రియ ముగియగానే రోడ్డు పనులు ప్రారంభం చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

ఇకో పార్కు రోడ్డు...

కొత్వాల్‌గూడ ఇకో పార్కు పక్క నుంచి హిమాయత్‌సాగర్‌ను ఆనుకుని ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ సన్నద్ధం అవుతోంది. 70 ఫీట్ల వెడల్పుతో కుడివైపు ఉన్న స్థలాన్ని మాత్రమే విస్తరిస్తూ చౌడమ్మ దేవాలయం దాటిన తర్వాత సాగర్ కట్ట వరకు కూడా రోడ్డు విస్తరించేందుకు హెచ్‌ఎండీఏ సాంకేతిక పనులు ఇప్పటికే ప్రారంభించింది. మొత్తం రూ. 30 కోట్ల నిధులతో ఈ రోడ్డును విస్తరించడానికి హెచ్‌ఎండీఏ సిద్ధమైంది. మరో పక్షం రోజుల్లో పనులు వేగంగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని హెచ్‌ఎండీఏ అధికారులు పేర్కొన్నారు.



ఇకో పార్కు రోడ్డుకు సంబంధించి సాంకేతిక అంశాలను నిర్వహిస్తున్న హెచ్‌ఎండీఏ సిబ్బంది

వాటితో ముప్పు...

కొత్వాల్‌గూడ రహదారులు ఛిద్రం కావడానికి ప్రధాన కారణం సమీపంలోనే ఉన్న క్రషర్, సిమెంట్ కాంక్రీట్‌కు చెందిన వాహనాల రాకపోకలే. ఈ విషయం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. వీటి కట్టడిపై స్థానిక యంత్రాంగాలు మిన్నకుండిపోతున్నందునే రోడ్లు పాడైపోతున్నాయనే ఆరోపణలూ లేకపోలేదు. అయితే కొన్ని రహదారుల ఏర్పాటులో ప్రజల ప్రయోజనం కన్నా సంబంధిత ప్రాంతాల్లో ఫాంహౌస్ ఏర్పాటు చేసుకున్న ప్రజా ప్రతినిధులు ప్రయోజనమే అధికంగా ఉందనే ఆరోపణలు ఉండటం కొసమెరుపు.

ఘనంగా నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు, మాజీ కౌన్సిలర్‌లు

మణికొండ: భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మర్రిచెట్టుకు సమీపంలోని గ్రామ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం నుంచే ఆయన పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఉచిత వైద్య శిబిరం, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు ఆయనతో కేక్‌లు కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ కొమరయ్య, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, జిల్లా నాయకుడు సి.బీరప్ప, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన

రాజేంద్రనగర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజలంతా తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓలు రజనీకాంత్ సూచించారు. అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండటంతో పాటు దోమలు ఈ సమయంలోనే వృద్ధి చెందుతాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలో ప్రజలకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కల్పించారు. ఇళ్లల్లో చెత్తాచెదారాలను నిలువ ఉంచకూడదని... పాత సామగ్రిని తొలగించాలని... టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలలో వర్షపు నీరు నిలువడంతో దోమలు వృద్ధి చెందుతాయని ప్రచారం చేపట్టారు. కొబ్బరి చిప్పలు, కొబ్బరిబొండాలు తదితర సామగ్రిని నిలువ ఉంచకూడదన్నారు. తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణదారునికి చెత్తను అందించాలన్నారు. రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని సూచించారు. తమ ఇళ్లతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షపు నీటితో పాటు మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్లు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

పాటలతో మార్మోగిన అపర్ణా నియో మాల్

ఆలపించిన ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణా నియో మాల్‌లో జరుగుతున్న ఎన్‌ఈఓఎస్‌ఎస్ షాపింగ్ ఫెస్టివల్‌లో తొలిసారిగా ఒక సెలబ్రిటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై తన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆమె లైవ్ పర్ఫార్మెన్స్ చూడటానికి వచ్చిన వందలాది మంది అభిమానులతో మాల్ మొత్తం సందడిగా మారిపోయింది. పాటలు, నృత్యాలతో షాపింగ్ ఫెస్టివల్ మరింత కళను సంతరించుకుంది. ఆగష్టు 17వ తేదీ వరకు ఈ ఫెస్టివల్‌లో షాపింగ్ చేసేవారికి బంపర్ ఆఫర్లు లక్కీ డ్రాను నిర్వహిస్తారు. ఒక ముందు కూడా ఈ షాపింగ్ ఫెస్టివల్‌లో ఎన్నో ఆసక్తికరమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆగష్టు 14, 15 తేదీల్లో జానపద నృత్యాల ఫెస్టివల్, ఆగష్టు 16న అద్భుతమైన శాండ్ ఆర్ట్ ప్రదర్శన వంటి ఈవెంట్లను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. ఈ సారి సిటీలో జరుగుతున్న అత్యంత డైనమిక్ షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్‌గా ఇది నిలుస్తుందని స్పష్టం చేశారు.



నల్లగండ్లలోని అపర్ణానియోమాల్‌లో షాపింగ్ ఫెస్టివల్‌లో ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను లిఖితపూర్వకంగా ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కబ్జాకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలి

రాజేంద్రనగర్: హిందూ శ్మశాన వాటికను చదును చేసి కబ్జాకు యత్నించిన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని మజ్లిస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు షేక్ రియాజ్ కోరారు. ఆదివారం ఉదయం హనుమాన్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిసర ప్రాంతాల ప్రజలు ఆరు దశాబ్దాలుగా హనుమాన్‌నగర్‌లో హిందూ శ్మశాన వాటికను వినియోగిస్తున్నారన్నారు. శ్మశాన వాటికపై కన్నేసిన రియల్టర్లు శ్మశాన వాటికను రాత్రికి రాత్రే చదును చేశారని ఆరోపించారు. పత్తికుంటలోకి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు శ్మశాన వాటిక పక్క నుంచి కాలువ ద్వారా ప్రవహించేదన్నారు.

భూ కబ్జాదారులు కాలువను మూసివేయడం ద్వారా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు స్థానికంగా ఉన్న ప్రహరీ కూలిందన్నారు. ఇదే అదునుగా కొందరు రియల్టర్లు హిందూ శ్మశాన వాటికను కబ్జా చేస్తూ ప్రహరీని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ దృష్టికి సోమవారం తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

'ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు'

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు బూత్ కన్వీనర్లతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును ప్రజలంతా మెచ్చుకుంటున్నారన్నారు. మన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అభ్యర్థి ఎవరైనా ఐక్యంగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, అఫ్రోజ్, గౌస్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ పటిష్టతకు పనిచేసే వారికి గుర్తింపు



నియామక పత్రాలను అందిస్తున్న సబితారెడ్డి

మణికొండ: బీఆర్‌ఎస్ పార్టీని మరింత పటిష్టంగా చేసేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తించి వారికి సముచిత స్థానం ఇస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో పలువురు యువకులు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇప్పటి వరకు పార్టీ అభివృద్ధికి పనిచేస్తున్న మైనార్టీ నాయకులకు ఆమె నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ... నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి సత్వర పరిష్కారానికి అవసరం అయితే పోరాటాలు చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన పథకాలు, ప్రస్తుతం అందుతున్న పథకాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలపై చర్చకు పెట్టాలన్నారు. నార్సింగి మున్సిపాలిటీకి చెందిన ప్రముఖ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు చాలా మంది రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌లో పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారిని చేర్చుకుని పార్టీని మరింత పటిష్టం చేస్తామన్నారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షుడిగా సయ్యద్ ముస్తఫా, ఉపాధ్యక్షులుగా గులాబ్ అసత్, సత్తార్‌ఖాన్‌లకు నియామక పత్రాలను అందజేశారు. పార్టీ నాయకులు ముత్యాలు, మహమూద్, మల్లేష్, యాదగిరి, నరసింహా, గణేష్ ముదిరాజ్, గణేష్‌రెడ్డి, మహిపాల్, ఇమ్రాన్ బాషా, రియాజ్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహాల ధ్వంసం దారుణం

- దుండగుడిని కఠినంగా శిక్షించాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని బంగారు మైసమ్మ దేవాలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ డిమాండ్ చేశారు. నిందితున్ని వెంటనే గుర్తించి అరెస్ట్ చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వ్యక్తిని.. అతడి వెనుక ఉన్న వారిని అరెస్ట్ చేయాలన్నారు. బంగారు మైసమ్మ దేవాలయం ఆవరణలోకి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ యువకుడు దేవాలయంలోని విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేసి పారిపోయాడు. నిందితుడు వెళ్లిన అనంతరం దేవాలయానికి వచ్చిన భక్తులు ఈ విషయాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు వై.శ్రీధర్, మహిపాల్ రెడ్డి, హరికిషన్ జీ, సందీప్ ముదిరాజ్, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, యువకులు పెద్ద ఎత్తున దేవాలయ ప్రాంగణంలోకి చేరుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని పట్టుకొని శిక్షిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ విషయమై రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మాట్లాడుతూ... దేవాలయాలపై దాడులు సహించరానిదన్నారు. నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కుట్ర జరుగుతుందని ఆరోపించారు. రానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.



దేవాలయాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మహేశ్వర్

ముగిసిన టీటీ టోర్నీ

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో దివంగత సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి స్మారక తెలంగాణ రాష్ట్ర స్థాయి వెటరన్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల కార్యదర్శి సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కె.మహేశ్వర్ హాజరయ్యారు. విజేతలకు బహుమతును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువకులు ఆటల పట్ల శ్రద్ధ చూపక సెల్‌ఫోన్ గేమింగ్, బెట్టింగ్‌ల వైపు ఆకర్షితులు అవుతున్నారన్నారు. శారీరక, మానసిక వికాసం చెందకుండా డిప్రెషన్‌కు లోనవుతూ తల్లిదండ్రులకు మనోవేదన కల్గిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంట్‌లో 40 సంవత్సరాలపైబడిన 50, 60, 70, 80 సంవత్సరాలపైబడిన క్రీడాకారులు ఉత్సాహంతో పాల్గొని నేటి యువతకు ప్రేరణ కలిగించారన్నారు. టీఎస్ టీటీఏ జనరల్ సెక్రటరీ పి.నాగేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి, చీఫ్ రిఫరీ లక్ష్మీకాంత్, అసిస్టెంట్ రిఫరీ శ్రీశంకర్, కళాశాల పీడీ ఎం.డి.జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్యలను అధిగమిద్దాం

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని, మిగిలిన సమస్యలపై కలసికట్టుగా కృషి చేసి వాటిని అధిగమించి ఆనందంగా జీవిద్దామని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులుతో పాటు పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. ఆదివారం భాగ్యలక్ష్మి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అధ్యక్షుడు వంశీ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు ఇంటి పన్నులు, రోడ్లు, ట్రాఫిక్, డ్రైనేజీ, వరదలు, లింక్ రోడ్లు, పార్కుల అభివృద్ధి, వాటి పరిరక్షణలపై కాలనీల వారీగా వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ... ఇటీవలి కాలంలో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. పలు కాలనీల్లో విద్యుత్ సమస్యలు, స్పీడ్ బ్రేకర్‌లు, తిరుమలహిల్స్ పార్క్ పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలను రాబోయే రోజుల్లో పరిష్కరించేందుకు హెచ్‌ఎండీఏ, హైడ్రా, సీడీఎంఏ, జిల్లా కలెక్టర్ లాంటి ఉన్నత స్థాయి అధికారులతో పాటు మంత్రులను కలిసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీగా హుడా కాలనీకి చెందిన కృష్ణ కుమార్‌ను నియమించారు. కార్యక్రమంలో పలు కాలనీల నాయకులు పాల్గొన్నారు.



సమస్యలపై చర్చిస్తున్న కాలనీల ప్రతినిధులు

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, లీలావతి

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌కు చెందిన సాయిటెక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత దివంగత ముత్యాల కృష్ణ తన స్వగృహంలోనే గతంలో సాయినాథుడి ఆలయాన్ని నిర్మించారు. టెంపుల్ నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన కుమారుడు ముత్యాల శేఖర్ బాబు, సుమలత దంపతులు, లీలావతి ఆదివారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. షిర్డీ నుంచి తెప్పించిన సాయినాథుడు ధరించిన కఫిని వస్త్రం, ఆయన పాదుకలను కళాకారుల బృందాలు, డప్పు వాయిద్యాల నడుమ లంగర్ హౌస్ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల సందర్శన కోసం ఆలయంలో పెట్టారు. అలాగే అన్నదానం నిర్వహించారు. 3 రోజులుగా కొనసాగుతున్న వేడుకల్లో నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదుకలు, కఫిని వస్త్రాన్ని దర్శించుకున్నారు.